గోవిందా.. ఇంత ఘోరమా..!


రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

శ్రీవారికి పుట్టు వెంట్రుకలు సమర్పించి వస్తుండగా.. రోడ్డు పక్కన ఆగిన లారీని ఢీకొన్న టెంపో ట్రావెలర్

తల్లీకొడుకు, కుటుంబ సభ్యురాలు, డ్రైవర్ మృత్యువాత

మరో 11 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం

బాధితులు గుడిబండ మండలం కుంబరనాగేపల్లి గ్రామస్థులు



పూర్తిగా దెబ్బతిన్న టెంపో ట్రావెలర్ వాహనం



అథర్వతో ప్రేమకుమారి(ఫైల్)

శ్రీనివాసుడి భక్తులను రోడ్డు ప్రమాదం కబళించింది. ముద్దుల కొడుకు పుట్టు వెంట్రుకలను స్వామివారికి సమర్పించి తిరిగి వస్తూ.. ఆ తల్లి.. కన్నకొడుకును ఒడిసి పట్టుకుని దివికి ఏగింది. రెండేళ్ల క్రితం ప్రసవించిన ఆమె.. కొడుకు బాగోగులను చూసుకునేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసింది. భర్తతో కలిసి బెంగళూరులో ఉంటూ.. తిరుమల వేంకటేశ్వరుడి మొక్కు తీర్చుకునే క్రమంలో స్వగ్రామానికి వచ్చింది. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అందరూ రెండు వాహనాలలో ఆనందంగా వెళ్లారు. మొక్కు తీర్చుకుని, స్వామివారిని దర్శించుకుని.. తిరిగి వస్తుండగా.. రోడ్డు పక్కన ఆగిన సిమెంటు లారీని వారు ప్రయాణిస్తున్న వాహనం వేగంగా ఢీకొట్టింది. ప్రమాద స్థలంలోనే తల్లి ప్రేమకుమారి, చిన్నారి అథర్వ మృతి చెందారు. మరో ఇద్దరు మడకశిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందేలోగా కన్నుమూశారు. వాహనంలో ఉన్న 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.



ఆస్పత్రి ఆవరణలో విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

(వివరాలు 7లో...)

సమష్టిగా జిల్లాను అభివృద్ధి చేద్దాం

ముందు వరుసలో నిలుపుదాం

దిశ చైర్మన్ బీకే పార్థసారథి

పుట్టపర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అందరం సమష్టిగా కృషి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని దిశా చైర్మన్, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి పిలుపునిచ్చారు. శనివారం మొదటిసారిగా జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం జిల్లా కలెక్టరేట్‌లో బీకే పార్థసారథి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, కలెక్టర్ టీఎస్ చేతన్, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవనం, ఉపాధిహామీ, భూగర్భ జలవనరులు, డీఆర్‌డీఏ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, స్కిల్ డెవలప్‌మెంట్, బీసీ సంక్షేమం, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దిశా కమిటీ చైర్మన్ బీకే పార్థసారథి మాట్లాడుతూ జిల్లాలో కరువు ప్రాంతాల నుంచి ప్రజల విముక్తి పొందే విధంగా అధికారులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందేలా కృషిచేయాలని తెలిపారు. జలమిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, కలెక్టర్‌తోపాటు ఆయా శాఖల అధికారులు పథకాల అమలుకు ప్రత్యేక చొరవ చూపాలని పేర్కొన్నారు. సమావేశంలో దిశ కమిటీ సభ్యులు శివశంకర్, చక్రవర్ధన్‌రెడ్డి, మీనాక్షి, రొద్దం నరిసింహులు, సువర్ణ, భారతి, రామాంజి, నరసింహమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మొదటిసారి జరిగిన దిశా సమావేశానికి జిల్లా మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం గమనార్హం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి, వేదికపై మంత్రి, ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్, కలెక్టర్

జిల్లాను అగ్రపథంలో నిలుపుదాం : సవిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి



సంక్షేమం, అభివృద్ధి పనులను పారదర్శకంగా నిర్వహించాలి. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తే జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తుంది. అందరం సమష్టిగా కృషి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు పనిచేద్దాం.

సమన్వయంతో పనిచేయాలి

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. అభివృద్ధిలో జిల్లాను ముందు వరుసలో నిలపడానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దాం. పంటలు సాగుచేసిన రైతులందరికి బీమా వర్తించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వేరుశనగకే కాకుండా మామిడి, వరి, కంది, తదితర పంటలకు కూడా బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తోంది. రైతులందరూ బీమాను సద్వినియోగం చేసుకోవాలి.

- ఎంఎస్ రాజు,
మడకశిర ఎమ్మెల్యే

ప్రజలకు మేలు చేకూర్చాలి

సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా ప్రజలకు అందించాలి. గ్రామాల్లో సుస్థిర ఆస్తులు సమకూర్చడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులను ఖర్చు చేయాలి. పార్టీలకు అతీతంగా నిష్పక్షపాతంగా అధికారులు ప్రజలకు సేవలు అందించాలి. సదరం సర్టిఫికెట్ల జారీలో ఉన్న లోపాలను గుర్తించి జిల్లాలోనే మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

- బోయ గిరిజమ్మ, జడ్పీ చైర్‌పర్సన్

లేపాక్షి శిల్పకళ అద్భుతం

మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అచల్‌కుమార్ పలివాల్

లేపాక్షి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): లేపాక్షిలోని దుర్గా వీరభద్ర స్వామి ఆలయంలో శిల్పకళ అద్భుతమని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అచల్‌కుమార్ పలివాల్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండల కేంద్రంలోని దుర్గావీరభద్ర స్వామి ఆలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఆలయ అర్చకులు నరసింహశర్మ, శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించి, వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ చరిత్రను న్యాయమూర్తి కుటుంబానికి గైడ్ రఘు వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి న్యాయమూర్తి.. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. లేపాక్షి తహసీల్దారు సౌజన్యలక్ష్మి న్యాయమూర్తిని సన్మానించారు.



లేపాక్షిలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడి వద్ద మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దంపతులు, లేపాక్షి తహసీల్దార్



ఎవరి దారి వారిదే..!

అధినేత ఆదేశాలు బేఖాతరు

రెండు నియోజకవర్గాల్లోనూ వేర్వేరుగా జన్మదిన వేడుకలు

వీడని వర్గపోరు

హిందూపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్నా ఆ నియోజకవర్గాల్లో మాత్రం వైసీపీలో వర్గపోరు వీడలేదు. ఆఖరికి అధినేత జన్మదిన వేడుకలు కూడా రెండు గ్రూపులుగా జరుపుకున్నారు. హిందూపురం, పెనుకొండలో పద్ధతి మారలేదు. దీంతో ఆ పార్టీలో కొంతమంది సీనియర్ నాయకులు గ్రూపు విభేదాలపై భగ్గుమంటున్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వేర్వేరుగా జరుపుకున్నారు.





టీచర్స్ కాలనీలో నవీన్‌నిశ్చల్ వర్గీయులు... పోలీస్ క్వార్టర్స్ కార్యాలయంలో దీపిక, వేణురెడ్డి వర్గీయులు

ఆది నుంచి అంతే..

వైసీపీ ఆవిర్భావం నుంచి హిందూపురం నియోజకవర్గంలో నాయకుల మధ్య వర్గపోరు సాగుతోంది. అధికారంలోకి రాకముందు మూడు గ్రూపులు ఉండేవి. అధికారంలోకి వచ్చాక నాలుగు గ్రూపులుగా కూడా అయ్యాయి. ఈ పరిస్థితుల్లో శనివారం జరిగిన జన్మదిన వేడుకల్లో ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్ టీచర్స్ కాలనీలోని కార్యాలయం వద్ద జన్మదిన వేడుకలు జరుపుకోగా.. ఇన్‌చార్జ్ దీపిక ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో చేసుకున్నారు. నవీన్ కార్యాలయం వద్దకు లేపాక్షి మండలం నుంచి జనం తరలిరాగా.. దీపిక కార్యాలయం వద్దకు పట్టణం నుంచి జనాన్ని తరలించారు. చీర, సారె ఇస్తాననడంతో జనం వచ్చారు. పెనుకొండ నియోజకవర్గంలో జగన్ జన్మదిన వేడుకలు గ్రూపులుగా విడిపోయి చేసుకున్నారు. మాజీ మంత్రి శంకర్‌నారాయణ పెనుకొండలోని తన నివాసం వద్ద జన్మదిన వేడుకలు జరుపుకోగా.. పెనుకొండలోనే మరోచోట మాజీ మంత్రి వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ వర్గం జరుపుకున్నారు. కాగా, ఇటీవల హిందూపురం నియోజకవర్గానికి చెందిన రెండు వర్గాలను ఆ పార్టీ అధినేత జగన్ తాడేపల్లికి పిలిపించారు. అందరూ కలిసి కార్యక్రమాలు చేయాలని, ఇక మీదట వర్గ విభేదాలు ఉండకూడదని, అలా ఉంటే ఉపేక్షించేది లేదని జగన్ చెప్పినట్లు సమాచారం. అయినా పురం, పెనుకొండలో వర్గ విభేదాలు కొనసాగుతున్నాయి.

కళింగర పంట పరిశీలన

ఆంధ్రజ్యోతికి స్పందన

గాండ్లపెంట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా వర్షాలు కురవడంతో భూమిలో తేమ శాతం పెరిగి కళింగర పంటలో ఎదుగుదల లేకపోయిందని ఉద్యాన శాఖాధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం 'కన్నీటి కళింగర' అనే శీర్షికన ప్రచురించిన వార్తకు ఉద్యానశాఖాధికారి స్పందించారు. గాండ్లపెంట మండలం తాళ్లకాలువ గ్రామం వెంకటరెడ్డి పొలంలోని కళింగరను పరిశీలించారు. గత కొద్దిరోజులుగా వర్షాలు కురవడంతో భూమిలో తేమ శాతం పెరిగి, పంటలో ఎదుగుదల లేకపోయిందని ఆయన తెలిపారు. దీంతో పూత, పిందె సమస్య ఏర్పడిందని, చీడపీడలు అధికంగా సోకాయన్నారు. వీటి నివారణకు సాలిసిక్ ఆమ్లం 100 పీపీఎం, 13.0.45, ఫార్ములా 4 అనే మందు 3 నుంచి 5 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి పిచికారి చేయాలన్నారు. అలాగే అవసరానికి తగ్గటుగా నీరు అందించాలన్నారు. పలురకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు రైతులు వెంకటరెడ్డి, కరీముల్లా తదితరులు ఉన్నారు.



కళింగర పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ ప్రతాప్‌రెడ్డి

కొత్తచెరువుకు చేరిన పది జవాబు పత్రాలు



కొత్తచెరువుకు చేరిన పదో తరగతి జవాబు పత్రాలు

కొత్తచెరువు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాలు కొత్తచెరువులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చాయని పరీక్షా విభాగపు అధికారి లాజర్ తెలిపారు. శనివారం విజయవాడ నుంచి కొత్తచెరువుకు వచ్చాయని, వీటిని విద్యాశాఖ గొడౌన్‌లో భద్రపరిచామని వివరించారు. అనంతరం వాటిని మండలాలలోని పరీక్షా కేంద్రాలకు పంపిస్తామని తెలిపారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

చేనేత కార్మికుడి మండల సంకల్ప దీక్ష



సంకల్ప దీక్ష చేస్తున్న చేనేత కార్మికుడు బీఎల్ నరసింహులు

ధర్మవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని పట్టుచీరల పాలిష్ కార్మికుడు బీఎల్ నరసింహులు మండల సంకల్ప దీక్ష చేపట్టారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేసుకుని మండల సంకల్ప దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుడు మాట్లాడుతూ... ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ 41 రోజుల పాటు మండల సంకల్ప దీక్ష చేపడుతున్నానని తెలిపారు. భారత రత్న కోసం పార్లమెంటులో ఎంపీలు కూడా పోరాటం చేయాలని కోరారు. ఎన్టీఆర్ విశ్వవిఖ్యాత నటసార్వభౌముడని, ఆయనకు భారత ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవచూపాలని తెలిపారు.







ఈఓకు వెండి కిరీటాన్ని అందజేస్తున్న భక్తులు

స్వామి వారికి వెండి కిరీటం అందజేత

ఉరవకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామికి గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన జీ. శ్రీరాములు, ఓబయ్య కుటుంబసభ్యులు వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఈఓ రమేష్ బాబుకు శనివారం ఈ కిరీటాన్ని అందజేశారు. దీని విలువ రూ.లక్ష ఉన్నట్లు భక్తులు తెలిపారు. నూతన రథం నిర్మాణానికి అనంతపురానికి చెందిన భక్తుడు శ్రీరాములు రూ.1.1లక్షలు విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ద్వారకనాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.

ధ్యానంతో ఆరోగ్యం

అంతర్జాతీయ ధ్యానదినోత్సవంలో ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే ధ్యానం చేయడం అలవర్చుకోవాలని, ధ్యానంతో మనసు, శరీరం ఆరోగ్యంగా ఉంటాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఉదయం నగరం లోని ఒకటో రోడ్డు కాశీ విశ్వేశ్వరదేవాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసం, ఆరోగ్యానికి ధ్యానం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రతి రోజు ప్రతి ఒక్కరూ కనీసం ఒక గంటైనా ధ్యానం కోసం కేటాయించాలన్నారు. వివేకానందయోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బ్రహ్మ విశ్వకుమారి సంస్థ ప్రతినిధి శార, డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా, అంతర్జాతీయ ధ్యానదినోత్సవాల గురించి వివరించారు. అనంతరం గంటపాటు ధ్యానం చేశారు. కార్యక్రమంలో వివేకానంద యోగా కేంద్రం, పతంజలి యోగా సమితి, రామకృష్ణ ప్రచార సమితి, ప్రజాపిత బ్రహ్మకుమారీస్, ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, హార్ట్‌ఫెల్‌నెస్ మెడిటేషన్ ఇనిస్టిట్యూట్, పిరమిడ్‌ధ్యాన కేంద్రం, సత్యసాయి ధ్యానమండలి, ఆర్ట్‌ఆఫ్ లివింగ్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

న్యూస్‌బాక్స్

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం అర్హతలున్న మున్సిపల్ టీచర్ల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేస్తూ ప్రమోషన్లకు అర్హత లున్న ఎస్‌జీటీల ఫైనల్ సీనియారిటీ జాబితా సిద్ధం చేశామన్నారు. 1:5 నిష్పత్తిలో జాబితాను సిద్ధం చేసి డీఈఓ బ్లాగ్‌లో ఉంచినట్లు తెలిపారు. జాబితాలోని టీచర్లు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు సర్వీస్ రిజిస్టర్లతో సోమవారం ఉదయం 11 గంటలకు డీఈఓ ఆఫీస్‌కు హాజరు కావాలని సూచించారు.

వసూళ్లు పూర్తి చేయండి

మూడు నెలలే సమయం ..!

మార్కెట్ ఫీజు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి: జేడీ

అనంతపురం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మరో మూడు నెలల్లో ఆర్థిక సం వత్సరం ముగుస్తుంది. ఆలోగా మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో శనివారం ఆయన అనంతపుం జిల్లా ఏడీ సత్యనారాయణ చౌదరితో కలిసి ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యదర్శులతో మార్కెట్ కమిటీల ఫీజు వసూళ్లపై సమీక్షించారు. కమిటీల వారిగా నిర్దేశిత లక్ష్యాలు..వసూళ్ల గురించి అధికారులతో ఆరాతీశారు. ఫీజు వసూళ్లు మందకొండిగా సాగుతున్నాయన్నారు. ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం అనంతపురం జిల్లాలోని మార్కెట్ కమిటీలకు రూ.12.06కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఆర్‌జేడీ పేర్కొన్నారు. నవంబరు వరకు రూ.9కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. ఫీజు వసూళ్లలో అనంతపురం, శింగనమ ల కమిటీలు బాగానే ఉన్నాయన్నారు. రా ప్తాడు, గుత్తి కమిటీలు వసూళ్లలో వెనుకబడ్డాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో నూ వెనుకబడే ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు లక్ష్యాలపై ప్రత్యేక ప్ర ణాళికలు రూపొందించుకుని వసూలు చేయాలని ఆదేశించారు.

15 మందికి ఉత్తమ అవార్డులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 15 మంది వ్యవసాయ అధికారులను ఉత్తమ అవార్డులకు ఎంపిక చేశారు. అనంతపురం ఏడీఏ రవి, కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, పెనుకొండ ఏడీఏ స్వయంప్రభ, ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారులు సోమశేఖర్, సుధాకర్, కాత్యాయని, సాయికుమార్, ముస్తాఫా, తిమ్మప్ప, సురేంద్రనాయక్, సతీష్ బాబు, నరసింహులు, లీలా వసుంధర ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న మరో 12 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. ఆ అధికారులకు ఈనెల 23న జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉరవకొండలోని ఉరగాద్రి కల్యాణ మండపంలో అవార్డులు ప్రదానం చేస్తామని సంస్థ నిర్వాహకులు ఓబులేసు తెలిపారు.

సీపీఎం సభలకు సన్నద్ధం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయి. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23, 24వ తేదీల్లో గుత్తిరోడ్డులోని ఎస్ఎస్ గ్రాండ్‌లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నారు. దాదాపు 11 సంవత్సరాల తర్వాత అనంతపురం వేదికగా మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం నుంచే ఏర్పాట్లకు ఆ పార్టీ నాయకులు సమాయత్తమయ్యారు. మహాసభల సూచికగా నగరంలోని క్లాక్‌టవర్ కూడలితోపాటు వివిధ ప్రధాన కూడళ్లలో సీపీఎం జెండాలను కడుతూ ఎరుపుమయం చేస్తున్నారు. మహాసభల సన్నాహకంగా ఆదివారం వందలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించనున్నారు. మహాసభలకు అన్నివర్గాల వారు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పిలుపునిచ్చారు.

రేపటి నుంచి 'ఓపెన్' ఫీజుల చెల్లింపు

అనంతపురం విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 10 వరకూ ఫీజు చెల్లించవచ్చునని డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 23 నుంచి 31వరకూ, ఒక సబ్జెక్టుకు రూ. 25ల ఫైన్‌తో జనవరి 1 నుంచి 4 వరకూ, రూ.50ల ఫైన్‌తో జనవరి 5 నుంచి 8 వరకూ, తత్కాల్ రుసుంతో జనవరి 9 నుంచి 10 వరకూ ఫీజులు చెల్లించవచ్చునన్నారు.

హాట్ సీట్..!

కంబదూరు సీడీపీఓ పోస్టుకు డిమాండ్

గుట్టుగా నలుగురి ప్రయత్నం

భారీగా ఆదాయం ఉండటంతోనేనా...?

గతంలో మాజీ మంత్రి అండతో లక్షల్లో అవినీతి



కళ్యాణదుర్గం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంబదూరు ఐసీడీఎస్‌లో సీడీపీఓ పోస్టుకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టుకు నలుగురు పోటీ పడుతు న్నారు. ఇక్కడ సీడీపీఓగా పనిచేసిన వనజా అక్కమ్మ ఏపీడీగా ఉద్యోగోన్నతిపై ఈ నెల 11న రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఈ సీడీపీఓ పోస్టు దక్కించుకునేందుకు నలుగురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

అతి పెద్ద ప్రాజెక్టుగా కంబదూరు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనే అతి పెద్ద ఐసీడీఎస్ ప్రాజెక్టుగా కంబదూరు ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 198 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి. పెద్ద ప్రాజెక్టు కావడంతో నిధులు కూడా భారీగానే వస్తుంటాయి. దీంతో అక్రమార్జనకు అవకాశం ఉంటుందనే ఉద్దేశ్యంతో సీడీపీఓ పోస్టు కోసం పలువురు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఆ పోస్టు దక్కించుకునేందుకు వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న సీడీపీఓలు గుట్టుగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వీరిలో శశికళ, యల్లమ్మ, నాగమణితో పాటు మరో సీడీపీఓ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో భారీగా ఆదాయ మార్గాలు ఉండటంతోనే ఇక్కడి సీడీపీఓ పోస్టుకు డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటం, కర్ణాటకకు సమీపంలో ఉండటంతో ఈ ప్రాజెక్టు గురించి ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ గతంలో పని చేసిన కొందరు అడ్డూ అదుపు లేకుండా అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ అవినీతి ఏ స్థాయిలో చేసినా అడిగే వారే లేరన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తుంటాయి.

వైసీపీ పాలనలో భ్రష్టుపట్టిన ప్రాజెక్టు

వైసీపీ పాలనలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉష శ్రీచరణ్ పనిచేసిన కాలంలో ఈ ప్రాజెక్టు భ్రష్టు పట్టిపోయిందనే విమర్శలు ఉన్నాయి. మంత్రి అండతో ఇష్టానుసారం పోస్టులను భర్తీ చేశారన్న ఆరోపణలు వినిపించాయి. అప్పట్లో ఆ ఐసీడీఎస్ కార్యాలయం దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. అక్కడ పనిచేసే అధికారి ఆడిందే ఆట, పాడిందేపాటగా సాగి ంది. అడిగే వారు లేరని దర్జాగా పోస్టులను అమ్మేసుకున్నారు. హెల్పర్లకు ప్రమోషన్ కల్పిస్తూ, ఇష్టానుసారంగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఆ పోస్టులను భర్తీ చేశారు.

ఒక్కో పోస్టుకు లక్షల్లో వసూలు

వైసీపీ పాలనలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు జరిగాయి. ఒక్కో పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు వసూళ్లు చేసినట్లు తెలిసింది. అధికారితో ఓ జూనియర్ అసిస్టెంట్ కుమ్మక్కై పోస్టులను భర్తీ చేయడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు సమాచారం. ఆ అక్రమ వసూళ్లను వీరిద్దరూ వాటాలు వేసుకుని పంచుకున్నట్లు తెలిసింది. వైసీపీ హయాంలో ప్రశ్నించే వారే లేరన్న ధీమాతో పోస్టులను ఎడాపెడా పోస్టులు భర్తీ చేసేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ అక్రమ వసూళ్ల తతంగం ఎక్కడికి దారి తీస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా కేంద్రం నుంచి వచ్చిపోతున్న సూపర్‌వైజర్లు

కంబదూరు ఐసీడీఎస్ కార్యాలయానికి సూపర్‌వైజర్లు ప్రతి రోజూ జిల్లా కేంద్రం వచ్చి పోతుంటారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఈక్రమంలోనే అంగన్‌వాడీల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రాజెక్టు పరిధిలో పనిచేసే సూపర్‌వైజర్లు విధులకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. ఈ ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చే నిధులన్నీ పక్కదారి పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్యాలయ పనితీరుపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్‌ఆర్‌ఐలకు అండ

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, గంటా శ్రీనివాసరావు

కళ్యాణదుర్గం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఐలకు కూటమి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఖతార్‌లో ఎన్‌ఆర్‌ఐలు శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే అమిలినేని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ దుర్మార్గ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రవాసాంధ్రులు పోలింగ్ రోజున వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం చారిత్రాత్మక విషయమన్నారు. మీరంతా అభిమానంతో మద్దతు ఇవ్వడం వల్లే చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో కూటమికి 164 సీట్లు వచ్చాయన్నారు. జగన్ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కించి, దేశంలో నెంబర్‌వన్‌గా నిలబెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఖతార్‌లోని ప్రవాసాంధ్రులకు అవసరమైన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం అమిలినేని సురేంద్రబాబును, గంటా శ్రీనివాసరావుని ఖతార్‌లో టీడీపీ, జనసేన శ్రేణులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

హెచ్చెల్సీ చైర్మన్‌గా కడప జోగిరెడ్డి

వైస్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన కేశవరెడ్డి



హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ సభ్యులతో బీటెక్ రవి, వెంకటశివుడు యాదవ్ తదితరులు



చైర్మన్ జోగిరెడ్డి, వైస్ చైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) కమిటీ ఎన్నికైంది. కడప జిల్లాకు చైర్మన్, అనంతపురం జిల్లాకు వైస్‌చైర్మన్ పదవులు దక్కాయి. రెండేళ్ల పాటు ఒకరు, మరో మూడేళ్ల పాటు మరొకరు పదవుల్లో కొనసాగేలా పరస్పర అంగీకారంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హెచ్చెల్సీ లోక్ డివిజన్ కార్యాలయంలో శనివారం హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నిర్వహిం చారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతపురం జిల్లాలోని 5డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్‌లు హెచ్ఎల్ఎంసీ కొండాపురం కేశవరెడ్డి, మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ డీసీ(డిస్ట్రిబ్యూటరీ కమిటీ) కొర్రపాటి శేఖర్, మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ డీసీ రాజారెడ్డి, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ డీసీ కుమెత ప్రమీలమ్మ, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్ డీసీ బొమ్మయ్యగారి మారయ్య హాజరయ్యారు. కర్నూలు జిల్లా ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ నగరడోన కిష్టప్ప హాజరయ్యారు. కడప జిల్లా నుంచి కసనూరు డీసీ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం డీసీ ఎర్రంరెడ్డి సూర్యశేఖర్‌రెడ్డి, వేంపల్లి డీసీ అన్నారెడ్డి వెంకట లక్ష్మిరెడ్డి, పెద్దముడియం డీసీ మాధవరెడ్డి, రాజుపాలెం డీసీ భూటూరు వెంకటజయరామిరెడ్డి, పోట్లదుర్తి డీసీ ఎద్దుల వెంకట సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో కడప జిల్లా కసనూరు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని(ఓసీ) చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా అనంతపురం జిల్లా హెచ్ఎల్ఎంసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కొండాపురం కేశవరెడ్డి (బీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మిగిలిన 10 డిస్ట్రిబ్యూటరీల చైర్మెన్లు సభ్యులుగా కొనసాగుతారు. ఎన్నికైన కమిటీని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్యకమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌ను నూతన కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



జిల్లా కమిటీతో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. జిల్లా కార్యాలయంలో శనివారం ఆమె జిల్లా కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ లింగనిర్ధారణ నిషేధిత చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డబ్బులకు ఆశపడి లింగ నిర్ధారణ చేసే డాక్టర్లు, స్కానింగ్‌సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆధారాలతో దొరికితే చట్టప్రకారం వారిపై కేసులు నమోదు చేసి ఆస్పత్రులు, స్కానింగ్‌సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ చేసిన డాక్టర్ల సర్టిఫికెట్లను రద్దు చేస్తామన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు ఎక్కువగా జరుగుతున్నాయని, అందుకే ఆ ప్రాంతాలలో ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. అందుకే సరిహద్దుప్రాంతాల అధికారులతో త్వరలో సమన్వయ సమావేశం నిర్వహించి, ఉమ్మడిగా తీసుకోవా ల్సిన చర్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లులోను ప్రచార పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టరు సుజాత, డాక్టరు యుగంధర్, డాక్టరు రవికుమార్, డాక్టరు అనుపమజేమ్స్, డాక్టరు ప్రసన్నభారతి, డాక్టరు లక్ష్మీ, ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటకుమారి, డీపీఆర్ఓ గురుమూర్తి, డెమోలు త్యాగరాజు, గంగాదర్, ఆర్బీటీ డాక్టరు దుర్గేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిత, వేణు, వెంకటేష్, శ్రీకాంత్, ఉషారాణి పాల్గొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత కోరారు. తన కార్యాలయంలో వీసీ శనివారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థతకు తగిన ఉద్యోగ, ఉపాధిని కల్పించేలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలను సమన్వయం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ, ఎస్కేయూ సంయుక్తంగా 24న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవు టెక్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్, ఐ-నన్ టెక్నాలజీస్, టీసీఎస్ తదితర సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థతతో 18నుంచి 30 సంవత్సరాల లోపు వయసుగల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. వివరాలకు యూఎస్‌డీఓ కరీముల్లా 8341366022 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

గుత్తి పీఎస్‌లో నలుగురు బదిలీ

గుత్తి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ జగదీష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్ఐ రామచంద్రరెడ్డిని అనంతపురం పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, హెడ్‌కానిస్టేబుళ్లు జాఫర్, బాలాజీలను అనంతపురం వన్‌టౌన్‌కు, షాజహాన్‌కు అనంతపురం టూటౌన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

వీఆర్‌కు కానిస్టేబుల్

ఉరవకొండ: ఉరవకొండ అర్బన్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కులశేఖర్‌రెడ్డిని వీఆర్‌కు పంపినట్లు సమాచారం. సంతకాలను ఫోర్జరీ చేసి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణల నేపథ్యంలో అతనిపై వేటు పడింది. జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

- అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌండేషన్, అమర రాజా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం నగర శివారు కక్కలపల్లి క్రాస్ సమీపంలోని ఎంపీ ఆఫీస్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా జాబ్ మేళా ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ అన్ని ట్రేడ్స్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు చిత్తూరు, తిరుపతిలోని అమరరాజా బ్యాటరీస్ సంస్థలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన ఉద్యోగులకు ట్రైనింగ్ సమయంలో రూ.12,500 నుంచి రూ.13,600 వరకు ఇవ్వడంతోపాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.22వేలు వేతనం ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9000024919, 9000433990 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆశాలపై వేధింపులు ఆపాలి: సీఐటీయూ

అనంతపురం టౌన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశాలపై ఎంఎల్‌హెచ్‌పీల వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకురాలు, ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌ఓను సీఐటీయూ నాయకులు శనివారం కలిశారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఆశావర్కర్లతో సంబంధంలేని పనులు చేయిస్తూ, వేధింపులకు దిగడం అన్యాయమన్నారు. సచివాలయాల వద్దకు రావాల్సిందేనని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఆశాలను వేధిస్తున్నారని తెలిపారు. తాడిపత్రి, ఉరవకొండ, గుత్తి, రాయదుర్గం, తదితరప్రాంతాలలో మూడు వేల నుంచి ఆరు వేలమందికి ఒక ఆశాను కేటాయించారని అలాంటపుడు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఈఒత్తిడి, మానసికవేదన తట్టుకోలేకనే ఉరవకొండలో ఆశా ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆశాలపై వేధింపులు, ఒత్తిళ్లు ఆపకపోతే పెద్దఎత్తున సీఐటీయూ తరపున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తూ డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెకు నాలుగు పిల్లలు



కుందుర్పికి చెందిన సజ్జల కేశన్న మందలో ఒక గొర్రె ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. సాధారణంగా గొర్రెలు ఒక కాన్పులో ఒక పిల్లకే జన్మనిస్తాయి. అరుదుగా రెండు పిల్లలకు జన్మనిస్తాయి. కానీ జన్యుపరమైన మార్పులు జరిగినప్పుడు మాత్రం అంతకు మించి పిల్లలు పుడతాయని పశు వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. విషయం తెలియగానే ఆయన వెళ్లి గొర్రెను, పిల్లలను పరీక్షించారు. అన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. ఈ వింతను చూసేందుకు స్థానికులు ఆసక్తికనబరిచారు.

- ఆంధ్రజ్యోతి, కుందుర్పి

నేడు 15వ వార్షిక సున్నీ ఇజ్‌తెమా

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెహరీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం 15వ వార్షిక సున్నీ ఇజ్‌తెమా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సభా ప్రాంగణాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సయ్యద్ అమీర్ మసూది సాహెబ్, జబల్‌పూర్‌కు చెందిన అబ్దుల ఖాదీర్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. మహ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, సాహాబాల పవిత్ర కేశాలు, వారి వస్త్రాలను భక్తుల సందర్శనార్థం ప్రదర్శించనున్నట్లు తెహరీక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా ఖాద్రి వెల్లడించారు. సున్నీ ఇజ్‌తెమాకు జిల్లాలోని వివిధ ముస్లిం సంఘాలు మద్దతు తెలుపుతూ శనివారం వేదికను సందర్శించాయి. ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఆవాజ్ వలి, ఇంతియాజ్, ఎంఎండీఏ ఇమామ్ తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ముతవల్లి ఫరీదుద్దీన్, హబీబ్, డాక్టర్ షఫి, అబ్దుల్ నమి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రయోజనం

ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతోందని ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు వాసుదేవరెడ్డి, దేవాంజనేయులు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల నైట్ అవుట్ అలవెన్సులను నిలుపుదల చేయగా.. వాటిని పునరుద్ధరించి, జనవరి నెల జీతంలో కలిపి చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో శనివారం అనంతపురం డిపో వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉన్న ప్రయోజనాలను సైతం అందకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. చంద్రబాబునాయుడు అలవెన్సులను పునరుద్ధరించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమర రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, గోపాల్, జయప్రకాష్, మదార్, మల్లికార్జున, జి.గోపాల్, నారాయణస్వామి పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు





మృతి చెందిన రత్నకుమారి, కుమారుడు అధర్వ, రత్నమ్మ, డ్రైవర్ మనోజ్(ఫైల్)



ప్రమాదంలో దెబ్బతిన్న టెంపో ట్రావెలర్

రోడ్డు పక్కన మృత్యువు

తల్లీకొడుకు, కుటుంబ సభ్యురాలు, డ్రైవర్ మృత్యువాత

మరో 11 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం

బాధితులు గుడిబండ మండలం కుంబరనాగేపల్లి గ్రామస్థులు

తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తుండగా ఘోర ప్రమాదం

ఆగిన సిమెంటు లారీని ఢీకొన్న టెంపో ట్రావెలర్

మడకశిర/టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి వస్తున్న సమయంలో ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న సిమెంటు లారీని టెంపో ట్రావెలర్ ఢీకొనడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను గుడిబండ మండలం కుంబర నాగేపల్లి గ్రామానికి చెందిన ప్రేమకుమారి(30), ఆమె కుమారుడు అధర్వ(2), కుటుంబ సభ్యురాలు రత్నమ్మ(65), డ్రైవర్ మనోజ్(32)గా గుర్తించారు. మడకశిర మండలం బుళ్లసముద్రం సమీపంలో శనివారం తెల్లవారు జామున సుమారు 4.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

కొడుకు కోసం..

కుంబర నాగేపల్లి గ్రామానికి చెందిన శివరాజ్, ప్రేమకుమారి దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అధ్వర్య పుట్టిన తరువాత రెండేళ్ల నుంచి కొడుకు సంరక్షణ కోసం ప్రేమకుమారి ఇంటికి పరిమితమయ్యారు. అథర్వ పుట్టు వెంట్రుకలను తీయించేందుకు తిరుమల శ్రీవారి సన్నిధికి రెండు వాహనాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో గురువారం వెళ్లారు. కార్యాక్రమాన్ని ముగించుకుని, శనివారం రాత్రి 10 గంటల సమయంలో తిరుగుప్రయాణమయ్యారు. మరో అర గంటలో గమ్యానికి చేరుకునేవారు. డ్రైవర్ మనోజ్ నిద్రమత్తు కారణంగా బుళ్లసముద్రం సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలబడి ఉన్న సిమెంటు బస్తాల లారీని గమనించకుండా వేగంగా ఢీకొట్టాడు. దీంతో అథర్వ, ప్రేమకుమారి అక్కడికక్కడే మృతి చెందారు. శివరాజ్ పెద్దమ్మ రత్నమ్మ, డ్రైవర్ మనోజ్ మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించేలోగా మృతిచెందారు. వాహనంలో ఉన్న నాగమణి, గీతమ్మ, శ్రీదేవి, సుజాతమ్మ, శ్వేత, గిరిజమ్మ, ఉమేష్, రవీంద్ర, అమ్మాజమ్మ, కమలమ్మ, గంగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. సుజాతమ్మ మెడలోకి ఇనుప రాడ్ దూసుకువెళ్లింది. దీంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను మడకశిర ఆస్పత్రి నుంచి తుమకూరులోని (కర్ణాటక) ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితులలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకొన్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, సీఐలు రామయ్య, రాజ్‌కుమార్ ప్రమాద స్థలాన్ని సందర్శించారు.



ఆస్పత్రిలో విషాద ఛాయలు

మడకశిర ఆస్పత్రి ఆవరణలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులతో ఆస్పత్రి నిండిపోయింది. అయినవారి మృతదేహాలను చూసి కన్నీటిని ఆపుకోలేకపోయారు.

అమ్మ ఒడిలోనే..

తిరుగు ప్రయాణంలో అథర్వ తల్లి ఒడిలోనే నిద్రించాడు. ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను మార్చురీకి తెచ్చేవరకూ తల్లీకొడుకులు కలిసే ఉన్నారు. కుమారుడిని ప్రేమకుమారి తన చేతుల్లో భద్రంగా పట్టుకున్నట్లు కనిపించడం పలువురిని కంటతడి పెట్టించింది. భార్య, కుమారుడు, పెద్దమ్మను కోల్పోయిన శివరాజ్‌ను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

నాయకుల పరామర్శ

ప్రమాదం గురించి తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ సహా పలువురు పార్టీ నాయకులు ఆస్పత్రి వద్దకు వెళ్లి బాధితులను ఓదార్చారు.

ఘోర ప్రమాదం ఇది : ఎస్పీ రత్న

శ్రీసత్యసాయి జిల్లాలో గడిచిన ఆరు నెలల్లో జరిగిన ఘోర ప్రమాదం ఇదేనని ఎస్పీ రత్న అన్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం మడకశిర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆమె పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. ఆస్పత్రి వద్ద ఉన్న ప్రేమకుమారి భర్త శివరాజ్‌ను ఓదార్చారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొన్నారు. తాను మరో వాహనంలో వస్తున్నానని, ముందు వస్తున్న టెంపోట్రావెల్ ప్రమాదానికి గురైందని ఆయన అన్నారు. జరిగిన ఘటన దురదృష్టకరమని, నష్టం పూడ్చలేనిదని ఎస్పీ విచారం వ్యక్తం చేశారు. అనంతరం మార్చరీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. డీఎస్పీ వెంకటేశులు, సీఐలు రాజ్‌కుమార్, రాగిరామయ్యకు పలు సూచనలు చేశారు. వెంటనే పోస్టుమార్టం పూర్తిచేయించి, కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించాలని సూచించారు. డ్రైవర్ మనోజ్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగిందని అంచనా వేశామని తెలిపారు. గోరంట్ల వద్ద ఆపి టీ తాగారని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలని డ్రైవర్‌కు వాహనంలో ఉన్నవారు సూచించినా, త్వరగా వెళ్లాలనే ఆతృతతో ప్రయాణం కొనసాగించాడని ఎస్పీ వివరించారు.



వైద్యులతో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రత్న

మంత్రి దిగ్భ్రాంతి

పెనుకొండ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మడకశిర మండలంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం గురించి తెలియగానే మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు మృతిచెందడం బాధాకరమని అన్నారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆరాతీశారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు.



అధికారులతో క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఆరాతీస్తున్న మంత్రి సవిత

విద్యారంగాన్ని ఆదర్శంగా నిలపడమే లక్ష్యం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



ఎంజేబీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

బుక్కపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంజేబీ పాఠశాల, హాస్టల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, పరిసర ప్రాంతాలు, మరుగుదొడ్లును నిశితంగా పరిశీలించారు. దోమలు విపరీతంగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఫాగింగ్‌చేసి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను కలిసి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును, హాస్టల్లో భోజన సదుపాయంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ప్రతిరోజు హాస్టల్ పరిసరాల్లో పోలీస్ గస్తీ నిర్వహించాలని ఎస్ఐ క్రిష్ణమూర్తిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ రమాదేవి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, జంగం వెంకటరాముడు, నారాయణస్వామి, మంజు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తరహళ్లి హుండీల ఆదాయం రూ.21 లక్షలు



ఆలయంలో హుండీ లెక్కిస్తున్న అధికారులు

మడకశిర రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి హుండీలను శనివారం లెక్కించారు. ఈ రెండు దేవాలయాల నుంచి రూ.21.01 లక్షలు వచ్చినట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. ఆంజనేయస్వామి హుండీ నుంచి రూ.8.11 లక్షలు, నరసంహస్వామి హుండీ నుంచి రూ.12.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ వివరించారు.

ఘనంగా గుత్తి రైల్వే డీజిల్ లోకో షెడ్ వార్షికోత్సవం



కేకేను కట్‌చేస్తున్న డీఆర్ఎం, అధికారులు

గుత్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే డీజిల్ లోకో షెడ్ 61వ వార్షికోత్సవాలను స్థానిక డీజిల్ షెడ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజరు విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, కేక్‌ను కట్ చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గుత్తి రైల్వే డీజిల్ షెడ్ కార్మికులు, అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. అనంతరం డీజిల్ షెడ్‌లో కంట్రోల్‌రూంను ఆయన ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాపోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీఎంఎస్ వేణుగోపాల్‌రెడ్డి, డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, డీఎస్ఏ మంగాచారి, ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మాధవి విజయ్‌కుమార్, స్థానిక ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ప్రియాంక, అధికారులు, వివిధ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చ ద్వారా సమస్యల పరిష్కారం

బుక్కపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చ ద్వారా విద్యా సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షా పే చర్చ-2025 కార్యక్రమానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన తెలిపిన వివరాల మేరకు 2025 జనవరి 14 లోపు గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6నుంచి 12తరగతివరకు చదివిన విద్యార్థుల తల్లిదండ్రులు అర్హులన్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు పై గవర్నమెంట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారు ప్రధానమంత్రితో చర్చలో పాల్గొనే అవకాశముంటుందన్నారు.

రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో బౌలర్ల హవా



కుశాల్



మహేంద్రసాయి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో బౌలర్ల హవా సాగింది. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బాలుర అండర్-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. బాలికల పోటీల్లో ధర్మవరం, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడ్డాయి. ధర్మవరం 19.3ఓవర్లలో79పరుగులకు ఆలౌట్ అయ్యింది. బౌలర్లు మాన్విత 3, హన్సిరెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతరం బరిలోకి దిగిన ఏఎస్ఏ 7.4ఓవర్లలో వికెట్ నష్టపోకుండానే లక్ష్యాన్ని ఛేదించింది. మరో మ్యాచ్‌లో గుంతకల్లు, నార్పల జట్లు తలపడ్డాయి. గుంతకల్లు 25ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. బ్యాటర్ నందిని 112 చేశారు. అనంతరం బరిలోకి దిగిన నార్పల 7.2ఓవర్లలో 17పరుగులకే ఆలౌట్ అయ్యింది. బౌలర్లు జాహ్నవి 4, నందిని 4వికెట్లు పడగొట్టారు.

బాలుర పోటీల్లో నార్పల, ధర్మవరం జట్లు తలపడ్డాయి. ధర్మవరం జట్టు 25ఓవర్లలో 85పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన నార్పల 20.1ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తపోవనం క్రికెట్ అకాడమీ, రాప్తాడు జట్లు తలపడగా... టీసీఏ 40ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 208పరుగులు చేసింది. కార్తీక్ 60, సాత్విక్ 51పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన రాప్తాడు 40ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 108పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి పర్యవేక్షించి సెంచరీలు నమోదు చేసిన క్రీడాకారులను అభినందించారు.

విద్యార్థి అదృశ్యం



విద్యార్థి జగదీష్ నాయక్

కదిరి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వీవర్స్ కాలనీలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి జగదీష్‌నాయక్ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు వార్డెన్ జయరామిరెడ్డి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి జగదీష్‌నాయక్, మరో అబ్బాయి ఫోన్ తీసుకుని హైదరాబాద్‌లో ఉన్న తన అమ్మమ్మతో మాట్లాడాడు. తనకు చదువుకోవడం ఇష్టం లేదని, అమ్మమ్మ వద్దకు వెళ్లతానని స్నేహితులతో చెప్పాడు. శనివారం ఉదయం హాస్టల్ సిబ్బంది గదిలో చూడగా జగదీష్‌నాయక్ కనిపించలేదు.

వార్డెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. జగదీష్‌నాయక్ ఆచూకీ తెలిసినవారు సీఐ నారాయణరెడ్డి ఫోన్ నెంబరు 9440796852, వార్డెన్ జయరామిరెడ్డి సెల్ 7780732031కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాలిక అదృశ్యం

అనంతపురం క్రైం,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్ సమీపంలోని చిల్డ్రన్స్ హోం నుంచి శుక్రవారం ఓ బాలిక అదృశ్యమైంది. కల్పనాజోష్ కాలనీకి చెందిన దూదేకుల షబీనా గత కొన్నేళ్లుగా చిల్డ్రన్స్ హోమ్‌లో ఉంటోంది. బాలిక అదృశ్యంపై చిల్డ్రన్స్ హోమ్ సూపరింటెండెంట్ నేతాజీ శనివారం ఫిర్యాదు చేశారు. ఆమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసత్యసాయి డీఎంహెచ్‌ఓగా ఫిరోజ్‌బేగం

అనంత ఆసుపత్రి ఆర్ఎంఓగా రామకృష్ణ

నెల్లూరు డీఎంహెచ్‌ఓగా అనంత డాక్టర్ సుజాత



డాక్టర్ ఫిరోజ్ బేగం



డాక్టర్ సుజాత

అనంతపురం టౌన్/పుట్టపర్తి రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ వైద్యుల ఆశలు నెరవేరాయి. రెండేళ్లుగా ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పిస్తామని ఊరడించి చేతులెత్తేసింది. దీంతో సీనియర్ డాక్టర్లు నిరాశతో ఉండిపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీనియర్ డాక్టర్ల ఉద్యోగోన్నతులకు అవకాశం కల్పించారు. అర్హత ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పించి పోస్టింగులు ఇచ్చింది. సత్యసాయి జిల్లా డీఎంహెచ్ఓగా డాక్టర్ ఫిరోజ్‌బేగంను ఉద్యోగోన్నతిపై నియమించింది. ఈమె అన్నమయ్య జిల్లా వాయల్పాడు సీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. అనంతపురం జిల్లా సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓగా డాక్టర్ సీహెచ్ రామక్రిష్ణ నియమితులయ్యారు. ఈయన కర్నూలు జిల్లా వైద్యవిధాన పరిషత్‌లో సివిల్ డిస్పెన్సరీ విభాగంలో పనిచేస్తున్నారు.

- అనంతపురం జిల్లాకు చెందిన సీనియర్ డాక్టర్ సుజాతకు ఉద్యోగోన్నతి దక్కింది. జిల్లా వైద్యశాఖలో ప్రస్తుతం ప్రోగ్రామ్ ఆఫీసరుగా పనిచేస్తున్న డాక్టర్ సుజాతను ఉద్యోగోన్నతిపై నెల్లూరు డీఎంహెచ్‌ఓగా నియమించారు. ఈమె 1997 డాక్టర్‌గా జిల్లాలో చేరారు. ముదిగుబ్బ, కొర్రకోడు, తనకల్లు, ఆత్మకూరు పీహెచ్‌సీలలో విధులు నిర్వర్తించారు. కొన్నేళ్లుగా జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వివిధ విభాగాలకు ప్రోగ్రామ్ ఆఫీసరుగా పనిస్తున్నారు. నెల్లూరు డీఎంహెచ్‌ఓగా వెళుతుండటంతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్, డీఎంఓ ఓబులు, డాక్టర్లు, వైద్యసిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

బైకులోని డబ్బు చోరీ



రైతు బోరుగుల అశోక్

కళ్యాణదుర్గం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన రైతు బోరుగుల అశోక్‌కు చెందిన రూ.75 వేలు శనివారం చోరీ అయ్యింది. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన అశోక్ గ్రామంలో మూడు ఎకరాల్లో అరటి సాగు చేశాడు. పంటను కంపెనీ వారికి విక్రయించాడు. అందుకు సంబంధించిన నగదును వారు బ్యాంకు అకౌంట్‌లో వేశారు. దీంతో ఆయన డబ్బులు డ్రా చేసుకుని కూరగాయలు తీసుకునేందుకు బళ్లారి మిట్ట మీదకు వెళ్లాడు. అయితే డబ్బులు ద్విచక్ర వాహనంలోనే ఉంచాడు. కూరగాయలు తీసుకునే సమయంలో నీలి రంగు టీ షర్టు వేసుకుని వచ్చిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలోని డబ్బు ఎత్తుకుని వెళ్లాడని రైతు వాపోయాడు. ఈ ఘటన జరిగిన ప్రాంతానికి డీఎస్పీ కార్యాలయం కూతవేటు దూరంలో ఉండటం గమనార్హం. చోరీ విషయమై బాధిత రైతు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు

పుట్టపర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో శనివారం క్రిస్మస్ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ క్రిస్మస్ క్యాండిల్స్‌ను వెలిగించి వేడుకలను ప్రారంభించారు. మహాసమాధి వద్ద ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం విదేశీ భక్తులు భక్తి పాటలు పాడారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గణేశ్ గేటు వద్ద క్రిస్మస్ ట్రీని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



మహాసమాధి వద్ద అలంకరణ




క్యాండిల్స్‌ను వెలిగిస్తున్న ఆర్‌జే రత్నాకర్

పర్కులేషన్ ట్యాంకు కోసం సర్వే

సీఎం హామీ నెరవేర్చే దిశగా అడుగులు

డి.హీరేహాళ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో పర్కులేషన్ ట్యాంక్ నిర్మించబోయే ప్రదేశంలో సర్వే పనులు చేపట్టారు. ఆ ప్రాంతంలో ముళ్ల కంపలు మొత్తం తొలగించారు. నాలుగైదు రోజుల్లో సర్వే పనులు మొత్తం పూర్తి చేసి అక్కడ నిర్మించబోయే పర్కులేషన్ ట్యాంకుకు సంబంధించి డీపీఆర్‌ను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని స్థానిక అధికారులు తెలిపారు. గత నెల 30న సీఎం చంద్రబాబు బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లులో పర్యటించిన సందర్భంగా పర్కులేషన్ ట్యాంకు కావాలని నియోజకవర్గ రైతులు ఆయనకు విన్నవించారు. దీంతో ఆయన పని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈక్రమంలోనే గురువారం నుంచి సర్వే పనులు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇక్కడ ఒక పెద్ద పర్కులేషన్ ట్యాంక్ నిర్మించి చుట్టుపక్కల గ్రామాల రైతులు, ప్రజలకు నీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చామన్నారు. దానికి కట్టుబడి ప్రభుత్వం నుంచి పర్కులేషన్ ట్యాంకు నిర్మాణానికి అనుమతి పొందామన్నారు. పనులను వెంటనే ప్రారంభించి ఏడాది కాలంలోపే ట్యాంక్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA- 224851

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926.

AJA-Noor

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్



డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చి నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి, 239-2ఏ, బైపాస్‌రోడ్, కక్కలపల్లి క్రాస్
అనంతపురం -515001
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 9985411154
బ్రాంచ్ మేనేజర్: 9985411151

న్యూస్ బాక్స్

మీ సహకారం అభినందనీయం

● పీఆర్‌ఓకు న్యాయధికారి, ఎస్పీ అభినందన



పోలీసు పీఆర్‌ఓ వెంకటేష్‌ను సన్మానిస్తున్న న్యాయాధికారి, ఎస్పీ

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు విజయవంతం కావడంలో మీపాత్ర అభినందనీయమని ఎస్పీ పీఆర్‌ఓ వెంకటేష్‌ను హిందూపురం జిల్లా న్యాయాధికారి శైలజ, ఎస్పీ రత్న కొనియాడారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన పోలీసు స్పోర్ట్స్ ముగింపు కార్యక్రమంలో ఆయన్ను దుశ్శాలువ మెమెంటోలను అందించి వారు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ విధినిర్వహణలో అనేక ఒత్తిళ్లు ఉంటాయని, పోలీసులకు క్రీడాపోటీలు నిర్వహించాలని ప్రయత్నాలు మొదలు పెట్టినప్పటి నుంచి విజయవంతంగా ముగిసేవరకు ప్రతి అంశాన్ని మీడియాతో సమన్వయం చేసుకున్న పీఆర్‌ఓ తీరు ప్రశంసనీయమన్నారు. పోలీసు స్పోర్ట్స్ కార్యక్రమాలు ప్రతి అంశాన్ని ప్రజలకు చేరవేయడంలో మీడియా కృషిని వారు అభినందించారు.

పాఠశాలకు విద్యా సామగ్రి వితరణ



పాఠశాలకు సామగ్రిని అందజేస్తున్న స్టేట్‌బ్యాంకు అధికారులు

తనకల్లు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలం బోడినేపల్లి ప్రాథమిక పాఠశాలకు తనకల్లు స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.5 లక్షలు విలువచేసే కంప్యూటర్లు, ప్రింటర్లు, టేబుల్స్, చెస్ బోర్డులు, బెంచీలు శనివారం వితరణగా అందచేశారు. పాఠశాలలో మెరుగైన విద్య అందించాలన్న ఉద్దేశంతో సామగ్రిని అందచేసినట్లు రీజనల్ మేనేజర్ శశిధర్‌కుమార్, ఆర్‌ఏఎసీసీ చీఫ్ మేనేజర్ శ్రీహరి, తనకల్లు చీఫ్ మేనేజర్ మురళీకుమార్ అన్నారు. తమ పాఠశాలను ఎంపిక చేసి సామగ్రిని వితరణగా ఇచ్చినందుకు హెచ్‌ఎం రామిరెడ్డి బ్యాంక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కొత్తచెరువు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలంటూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ గతంలో ఇళ్లు ఉన్నవారికి, ధనికులకు, రాజకీయ పలుకుబడి ఉన్న వారికి ఇళ్లపట్టాలు మంజూరు చేశారని, అర్హులకు అన్యాయం చేశారన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ నీలకంఠారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, ఐద్వా మహిళా నాయకురాళ్లు నాగమణి, కవిత పాల్గొన్నారు.

హంసవాహనంపై అయ్యప్పస్వామి



ఓబుళదేవరచెరువు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం 6వ రోజు స్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమించారు. ఎం.కొత్తపల్లి, వడ్డివారిపల్లి, ఓడీచెరువు పురవీధుల్లో ఊరేగించినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు.

నాయీబ్రాహ్మణుల పొట్ట కొట్టొద్దు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయీబ్రాహ్మణులు

కదిరి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్షౌరవృత్తిలోకి కొన్ని కార్పొరేట్ సంస్థలు రావడానికి ప్రయత్నిస్తున్నాయని, వాటిని ప్రభుత్వం అడ్డుకోవాలని నాయీబ్రాహ్మణుల సంఘం నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ వందల సంవత్సరాలనుంచి క్షౌరవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. తరాలుగా వృతిని నమ్ముకుని బతుకుతున్నామని, కొన్ని కార్పొరేట్ సంస్థలు ప్రవేశించి పొట్టకొట్టాలని చూస్తున్నాయన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, అధికారులకు వినతిపత్రాలు అందించామన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు హరిప్రసాద్, శివకుమార్, కృష్ణ, శ్రీనివాసులు, శివ, రామాంజనేయులు, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలి



కందిపంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బత్తలపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి సమీపంలో కంది పంటలను శనివారం సీపీఐ నాయకులు కంఠ కాటమయ్య, కమతం కాటమయ్య పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ, కంది పంట లు సాగుచేసిన రైతులు ప్రతికూల వాతావరణం కారణంగా పూర్తిగా నష్టపోయారన్నారు. సాగు చేసిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.20వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. పీఏబీఆర్ కుడి కాలువ కింద ఉన్న చెరువులను నీటితో నింపాలన్నారు.

ఏజెన్సీల ద్వారా ఇసుక లోడింగ్‌కు అనుమతి

ధర్మవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ముదిగుబ్బ మండలంలో పీసీరేవు, తాడిమర్రి మండలంలోని సీసీరేవు ఇసుక డిపోల వద్ద ఏజెన్సీల ద్వారా ఇసుక లోడింగ్‌కు అనుమతి ఇచ్చినట్లు ఆర్డీఓ మహేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక కావాల్సిన వారు రీచ్ దగ్గరికి వాహనంతోపాటువెళ్లి ఏజెన్సీలకు టన్నుకు రూ.260 చెల్లిస్తే ఇసుకను లోడ్ చేసి ఇస్తారన్నారు. నదీ ప్రవాహాలకు ఆనుకుని ఉన్న స్థానిక ప్రాంతాలకు చెందిన వినియోగదారులకు మాత్రమే ఉచిత ఇసుక తీసుకుని వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. అటువంటి వినియోగదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శం : మంత్రి



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి, ఎంపీ, కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షక కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమి క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు ఒక మతానికి సంబంధించినవి కావని, యావత్తు మానవాళికి మార్గదర్శకం చేసేవని అన్నారు. హిందూపురం ఎంపీ పార్థసారధి మాట్లాడుతూ యేసుక్రీస్తు మనుషులను ప్రేమించాలని, వారి తప్పులను క్షమించాలని ప్రపంచానికి బోధించిన శాంతి దూత అన్నారు. అనంతరం మంత్రి, ఎంపీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కలెక్టర్ టీఎస్ చేతన్, క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ అధికారి రామసుబ్బారెడ్డి, ఏఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్‌కుమార్, పాస్టర్లు డేనియల్, సరేశ్వరరావు, శ్యామ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొలాలకు దారి చూపాలని రైతుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంతో తమ పొలాలకు రోడ్డు సౌకర్యం లేకుండపోతోందని, రోడ్డు సౌకర్యం కల్పించాలని రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మండలంలోని కొండకమర్ల పంచాయతీ కొండ తిమ్మయ్యగారిపల్లి, చెరువుమునెప్పగారిపల్లికి చెందిన రైతులు రాజారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఈశ్వరయ్య మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన దాదాపు 500 ఎకరాలకుపైగా సాగు విస్తీర్ణం ఉందన్నారు. ఆ పొలాల్లోకి వెళ్లాలంటే రోడ్డు మొత్తం మూసివేయడంతో దారిలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో కూడా దారి విషయంపై నేషనల్ హైవే కార్యాలయం కడప వారికి విన్నవించామన్నారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. పొలాలకు దారి చూపించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి అందించారు. రైతులు ప్రసాద్‌రెడ్డి, చలపతి, నారాయణస్వామి, వెంకటేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రేపు మంత్రి సత్యకుమార్ ధర్మవరం రాక

ధర్మవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సోమవారం ధర్మవరం రానున్నట్టు బీజేపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలోపేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10గంటలకు నూతనంగా ఏర్పాటుచేసిన ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. 11-30గంటలకు తుమ్మల గ్రామంలో డంపింగ్ యార్డ్‌లో వర్మీకంపోస్టు యూనిట్ ప్రారంభం, మధ్యాహ్నం 12-30 నుంచి 2గంటల వరకు జరిగే మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

కొత్తచెరువు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సీఎస్‌డీటీ రమేశ్ తెలిపారు. శనివారం ముందుగా విద్యార్థులకు జాతీయ వినియోగదారుల వారోత్సవ విశిష్టతను వివరించారు. విద్యాశాఖ ఏడీ లాజర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వక్తృత్వ పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానల్లో ఎం.జగన్నాథ్, షణ్ముకేశ్వర్‌కుమార్, బి.మురీఫా నిలిచారన్నారు. వ్యాసరచన పోటీల్లో ఎన్ క్రాంతిరెడ్డి, ఆయిషాబానీ, జీ వైష్ణవి మొదటి మూడుస్థానాల్లో నిలిచారన్నారు. వీరికి రూ.3,000, రూ.2,000, రూ.1,500 నగదు బహుమతిని అందించనున్నట్లు తెలిపారు.

మలకవేమలను మండల కేంద్రంగా ప్రకటించాలి

కదిరి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మలకవేమలను మండల కేంద్రంగా ప్రకటించాలని పలువురు కోరారు. శనివారం ఆప్రాంత సర్పంచ్‌లు, రాజకీయ పార్టీల నాయకులు కదిరి పట్టణంలోని అర్‌అండ్‌బీ బంగ్లాలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ముదిగుబ్బ మండలపరిధిలో ఉన్న మలకవేమలను, మండలంగా ప్రకటించాలన్నారు. ముదిగుబ్బ మండలంలో 27 పంచాయతీలు దాదాపు 44వేల ఓటర్లు ఉన్నారన్నారు. పరిపాలన పరంగా ముదిగుబ్బ పెద్ద మండలమని, దీంతో సమస్యల పరిష్కారానికి కాలయపాన జరుగుతోందన్నారు. గ్రామీణులు ముదిగుబ్బకు వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడుతున్నారన్నారు. అలాగే రెవెన్యూ, పోలీస్, సబ్‌డివిజన్‌కు వెళ్లాలంటే వంద కిలోమీటర్ల దూరంలోని ధర్మవరం వెళ్లాలన్నారు. కదిరిలో కోర్టు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఏరియా ఆసుపత్రి ఉన్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని మలకవేలను మండలగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన

కదిరి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుమ్మరవాండ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో రెడ్స్ ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌ప్రసాద్, రెడ్స్ అధ్యక్షురాలు భానూజా మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. అలాగే వినియోగదారలు కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లు తీసుకోవలన్నారు. తూకాలు తక్కువకాకుండా చూసుకోవాలన్నారు ఎమ్మార్పీ ధరలకే కొనుగోలు చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే వినయోగదారుల ఫోరంలో కేసు వేసుకునే సౌకర్యముందున్నారు. కార్యక్రమంలో పలువురు రెడ్స్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిజిటల్ సేవలపై..

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ప్రతి అంశం డిజిటల్ విధానంలోనే ఉంటాయని, వీటిపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఒకేషనల్ ట్రైనర్ నరేష్‌కుమార్ అన్నారు. శనివారం ఇండిస్ట్రియల్ సందర్శనలో భాగంగా మండలంలోని జగరాజుపల్లి ఆదర్శపాఠశాల విద్యార్థులకు గ్రామ సచివాలంలో డిజిటల్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో ప్రజలకు అన్‌లైన్‌లో అందించే సేవలు, కంప్యూటర్ పరిజ్ఞానంపై వివరించారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ



ఎనుములపల్లి ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న నాగేంద్ర నాయక్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి ప్రాథమిక, అర్బన్‌ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం ఆయా ఆరోగ్యకేంద్రాల్లో రికార్డుల తనిఖీలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని, వ్యాక్సిన్ నిల్వచేసే పద్ధతులను, లబ్ధిదారులకు అందచేసే సందేశాలను విచారించారు. అదేవిధంగా ఎస్సీడీ, ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత ఎనుమలపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య విషయాలను అడిగితెలుసుకున్నారు. వైద్యాధికారులు జోత్న్స, భవ్య, సామాజిక ఆరోగ్యకేంద్ర అధికారి నగేష్ పాల్గొన్నారు.

తీరిన తాగునీటి కష్టాలు



పార్థసారధినగర్-2 కాలనీకి వాటర్ కనెక్షన్ ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

ధర్మవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డు పార్థసారధినగర్-2 కాలనీ వాసులకు నాలుగేళ్ల తరువాత తాగునీటి కష్టాలు తీరాయి. వైసీపీ హయాంలో పైపులైన్‌లు వేశారే కానీ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో నాలుగేళ్లుగా కాలనీవాసులు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసేవారు. ఉప్పునీటినే వాడుకునే వారు. ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ ప్రత్యేక చొరవతీసుకుని శనివారం మున్సిపల్ సిబ్బందితో పైపులైన్‌కు కనెక్షన్ ఇప్పించి కొళాయిలకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు మాధవరెడ్డి, మున్సిపల్ ఫిట్టర్ సురేశ్ పాల్గొన్నారు.

పైపు లీకేజీకి మరమ్మతులు



పైపు లీకేజీకి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ధర్మవరంరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామంలో తాగునీటి పైపు లీకేజీ అయి నీరంతా వృథాగా పోతోంది. 17న ఆంధ్రజ్యోతిలో తాగునీటి పైపులీకేజీ అయి నీరు కలుషిత మవుతున్నట్లు కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ సాయిమనోహర్ పైపు లీకేజీకి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం మరమ్మతు పనులు చేపట్టి లీకేజీ నీటిని అరికట్టారు. గత రెండేళ్లుగా నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా గణితశాస్త్ర దినోత్సవం



నమూనాలను ప్రదర్శిస్తున్న శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థులు

ధర్మవరం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో శనివారం గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణితశాస్త్ర పితమహుడు శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి కరస్పాండెంట్ శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరామానుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గణితంలో రాణిస్తే పోటీపరీక్షలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన గణితశాస్త్ర నమూనాలను పరిశీలించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీసీఎంఆర్ పాఠశాలలో...: మండలంలోని నాగలూరు వద్దనున్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గణితానికి సంబంధించిన వివిధ నమూనాలను ప్రదర్శించారు. అనంతరం పాఠశాల చైర్మన్ హర్షవర్దన్ మాట్లాడుతూ 20వ శతాబ్దంలో శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించిందన్నారు. పాఠశాల డైరెక్టర్ రూపారాజా కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది

● జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం



ధర్మవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులుతీస్తోందని, ఇది ఓర్వలేకే మాజీ సీఎం జగన్, వైసీపీనాయకులు విమర్శలు చేస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం తన స్వగ్రహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కక్షపూరితమైన పాలన చేసిందని, అందుకే ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారన్నారు. అయినా వారికి బుద్ధిరాలేదన్నారు. గతంలో ఇళ్ల పట్టాలు పొంది ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం మంచి అవకాశం ఇచ్చిందన్నారు. ఇళ్లు నిర్మించుకుంటే గతంలో ఇచ్చే దానికంటే అదనంగా ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇస్తుందన్నారు. చేనేత కార్మికులకు కూడా రూ.50వేలు ఇస్తుందన్నారు. అంతేకాకుండా 2013లో పట్టాలుపొంది ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించుకోని వారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జనసేనలోకి 15 కుటుంబాలు చేరిక: బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామం నుంచి 15 కుటుంబాలు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో శనివారం పార్టీలోకి చేరారు. జనసేన మండల అధ్యక్షుడు పుర్రంశెట్టి రవి, రమణారెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ కుటుంబ సభ్యులకు మధుసూదన్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాధారంగా ఆహ్వానించారు. ఏ సమస్య వచ్చినా మీకు అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని పార్టీలోకి చేరినవారికి ఆయన భరోసా ఇచ్చారు.



యోగివేమన ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పరిటాలశ్రీరామ్

ఆయకట్టు రైతులకు ఉపయోగపడండి

● ప్రాజెక్టు కమిటీకి పరిటాల శ్రీరామ్ సూచన

ధర్మవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన ముదిగుబ్బ మండలంలోని యోగివేమన ప్రాజెక్టు నిర్మాణ లక్ష్యాన్ని నెరవేరుద్దామని నూతన కమిటీ సభ్యులతో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. శనివారం యోగివేమన రిజర్వాయర్‌కు ఎన్నికలు జరగ్గా చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. చైర్మన్‌గా జయప్రకాశ్‌నాయుడు, వైస్ చైర్మన్‌గా డేగల శివయ్య ఎంపికయ్యారు. వారు నూతన కమిటీ సభ్యులతో కలిసి అనంతపురంలోని పరిటాలశ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి విబేధాలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించడం పట్ల ఆయన అభినందించారు. ప్రాజెక్టు నిర్మాణం నుంచి పూర్తిస్థాయిలో నీరు వచ్చి ఆయకట్టుకు నీరందించే పరిస్థితులు లేవని, ఇక నుంచి ఆయకట్టు రైతులకు ఉపయోగపడే విధంగా పనిచేయాలని వారికి శ్రీరామ్ సూచించారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీరు తెచ్చేలా కృషిచేస్తామన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు నిర్మాణ ఉద్దేశ్యాన్ని నెరవేరుస్తానని పరిటాలశ్రీరామ్ హామీ ఇచ్చారు.

చైర్మన్, వైస్‌చైర్మన్ల ఏకగ్రీవం

ముదిగుబ్బ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మండలంలోని యోగివేమన రిజర్వాయర్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను శనివారం ఏకగ్రీవంగా ఎంపికచేసినట్టు హంద్రీనీవా సుజలస్రవంతి ఈఈ మురళి తెలిపారు. ప్రాజెక్టు చైర్మన్‌గా జయప్రకాశ్‌నాయుడు, వైస్‌చైర్మన్‌గా డేగల శివయ్యలను ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లను టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, నాయకులు కోట్లబాబీ సత్కరించారు. ప్రాజెక్టు అభివృద్ధితోపాటు రైతులకు న్యాయం జరిగేవిధంగా చూడాలన్నారు.

మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించాలి

ధర్మవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ రైతుసంఘాల సమన్వయసమితి నాయకులు జంగాలపల్లిపెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన మార్కెట్ చట్టం జిరాక్స్ కాపీలను దగ్ధం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన చేపట్టాలని రాష్ట్ర సంఘం పిలుపునిచ్చిందని, ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో 23వ తేదీన నిరసన చేపట్టాలని రైతులకు విజ్ఞప్తిచేశామన్నారు. రైతులపై జరుగుతున్న దమనకాండలను ఆపాలని కోరారు శంభూబోర్డర్‌లో రైతు ఉద్యమ నాయకులపై కేంద్ర ప్రభుత్వం పైశాచిక దాడిని ఖండిస్తున్నామన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, ఎస్‌హెచ్ బాషా, కదిరెప్ప పాల్గొన్నారు.

బస్సుల కండిషన్ మెరుగునకు చర్యలు

కదిరి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల కండిషన్ మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అనంతపురం రీజియన్ మెకానికల్ విభాగం ఇంజనీర్ రమేష్‌బాబు సూచించారు. శనివారం కదిరి ఆర్టీసీ డిపో గ్యారేజీని ఆయ న పరిశీలించారు. అన్నివిభాలను పరిశీలించి, టైలర్ల సెక్షన్, బ్యాటరీలు, పె యింటింగ్, స్టోర్ ప్రాంతాలను చూశారు. బస్సుల కండీషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బస్సుకు చిన్న సమస్య వచ్చిన వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఇంధన పొదుపులో డ్రైవర్లు మెలకువలు పాటించాలన్నారు. ఇంధన పొదుపు తక్కువ వస్తున్న డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అయనతోపాటు డీఎం మైనోద్దీన్, అసిస్టెంట్ ఇంజనీర్ రామక్రిష్ణ, గ్యారేజీ ఉద్యోగి నబీరసూల్ పాల్గొన్నారు.

యువతకు క్రీడాపోటీలు

కదిరి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓబులేశ్వరా డిఫెన్స్ అకాడమిలో శనివారం కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం, యువజన జాగృతి సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో యువతకు క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ క్రీడలను నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడకారులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. యువజన జాగృతి సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్, ఓబులేశ్వరా డిఫెన్స్ ఆకాడమి చైర్మన్ ఓబులేసు, డైరెక్టర్ ప్రభాకర్డి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్

కదిరి అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శనివారం నగదు బహుమతులు అందించారు. 6, 7, 8 తరగతుల్లో సాధించిన మార్కులను బట్టి వరుసగా కె. నవ్య, (7వతరగతి), పి.శాంతి, దేవనందిని 8వతరగతి ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున నగదును గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రమేష్ అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతియేటా ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బ్యాంక్ సహకారంతో బహుమతులుఅ అందిస్తున్నామన్నారు. హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలో పడి కాడెద్దులు మృతి

బుక్కపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో పడి కాడెద్దులు మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తకోట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పక్కీరప్ప శనివారం ఉదయం తన వ్యవసాయ పనుల నిమిత్తం ఎద్దుల బండితో పొలంలోకి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు బండి, ఎద్దులు కాలువలోకి పడిపోయాయి. ఈ ఘటనలో రెండు ఎద్దులు మృతిచెందినట్లు రైతు తెలిపారు. రూ.రెండులక్షల విలువ చేస్తే ఎద్దులు మృతిచెందడంతో రైతులు కంటతడి పెట్టారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

బత్తలపల్లి డిసెంబర్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముత్యాలప్ప(58) అనంతపురం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ధర్మవరం మండలం నాగలూరుకు చెందిన ముత్యాలప్ప కూలి పనులు చేసుకొని జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో కూలీకి అస్వస్థత

నంబులపూలకుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువతూపల్లి దళితవాడకు చెందిన వ్యవసాయ కూలీ హరి శనివారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. మండ్యెంవారిపల్లిలో టమోటా పంటలో పనిచేస్తుండగా పాముకాటు వేసింది. గమనించిన హరి రైతులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతన్ని నంబులపూలకుంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరికి తరలించారు.

కోళ్లఫారం సూపర్‌వైజర్ ఆత్మహత్య

నంబులపూలకుంట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కాలువపల్లి సమీపంలో ఉన్న కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బాలసుబ్రమణ్యం(35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన బాలసుబ్రమణ్యం కోళ్లఫారంలో ఉరి వేసుకున్నాడు. అక్కడున్నవారు గమనించి వెంటనే నంబులపూలకుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరుపతికి చెందిన కొందరు కోళ్లఫారాన్ని లీజుకు తీసుకుని నడుపుతున్నారు. ఇందులో బాలసుబ్రమణ్యం కొన్ని నెలలుగా పనిచేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అన్నమయ్య జిల్లా మదనపల్లికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

క్లుప్తంగా..

ప్రతిభావంతులైన క్రీడాకారులకు సన్మానం


క్రీడా విజేతలను సన్మానిస్తున్న ట్రస్టు నిర్వాహకులు

గోరంట్ల, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి) :క్రీడల్లో ప్రతిభ ప్రదర్శించిన పట్టణంలోని బాలికోన్నత పాఠశాల బాలికలను విశ్వసాయి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ట్రస్టు ఛైర్మన్ భైసాని శ్రీనివాసగుప్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాల్ బ్యాట్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో భవిష్యలక్ష్మీ ద్వితీయ స్థానంలో నిలిచి రన్నర్సు కప్పు అందుకున్నారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో కళ్యాణి, పల్లవి పాల్గొన్నారు. బేస్‌బాల్‌లో పవిత్ర ,రూపా, దివ్య, సాఫ్టబాల్‌లో సాహిత్య, శ్వేత, త్రోబాల్‌లో హర్షిత పాల్గొన్నారు. వీరే గాక జిల్లాస్థాయిలో ఆడిన హేమశ్రీ, కళ్యాణి, సింధూశ్రీ, పలానీశ్రీ, దీపికలను కూడా శాలువలతో సత్కరించి రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు, నోటు పుస్తకాలు, విద్యాసామాగ్రి అందించి అభినందించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం మాధవీలత, పీడీ సూర్యనారాయణమ్మ, ట్రస్టు సభ్యులు రమేష్, దేవిస్వామి పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను కాపాడాలి


వినియోగదారుల హక్కులపై మాట్లాడుతున్న బాబయ్య

గోరంట్ల, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు ప్రతి ఒక్కరు హక్కులను వినియోగించుకోవాలని ఎవరూ మోసపోకూడదని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గోరంట్లలోని బాలుర ఉన్నతపాఠశాలలో వినియోగదారుల హక్కుల రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కొంత మంది వ్యాపారులు అధిక ధరలతో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రజలు చైతన్యవంతులైన వినియోగదారుల సంఘానికి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. వినియోగదారుల హక్కులు, వాటి పరిరక్షణ గురించి వక్తలు వివరించారు. ఈకార్యక్రమంలో సీఎస్‌డిటీ శ్రీధర్, జిల్లా గ్యాస్ డీలర్ల సంఘం రాజీవ్‌దేవ్, జిల్లా వినియోగదారుల అధ్యక్షులు బాబాయ్య, విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యులు మణిమాల, లక్ష్మీనారాయణరెడ్డి, హెచ్‌ఎం గోపాల్ తదితరులున్నారు.

ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి

హిందూపురం అర్బన్,డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రసిద్ధ పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చన నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో వైకుంఠవాసుని పూలు నగలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిలో అధిరోహింపచేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

మాలధారులకు భిక్ష

పరిగి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అయ్యప్ప మాలధారులకు మున్నా జియావుల్లా మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం భిక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 41రోజులు నియమనిష్టలతో కఠిన దీక్షతో అయ్యప్పమాల ధరించిన స్వాములకు తాను భిక్ష అందించడం ఆనందంగా ఉందన్నారు. కుల మతాలకు అతీతంగా అయ్యప్పలకు భిక్ష అందించిన మున్నా జియావుల్లాను అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి నరసింహప్ప, లింగారెడ్డి, కన్నప్ప పాల్గొన్నారు.

తిరుపతికి పాదయాత్ర


తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న భక్తబృందం

పరిగి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటకూరు గ్రామం నుంచి తిరుపతికి పలువురు భక్తులు శనివారం పాదయాత్రగా వెళ్లారు. పాదయాత్ర బృందానికి స్థానిక నాయకులు దారి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. దాదాపు 50మంది ఇక్కడి నుంచి పాదయాత్రగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నరేంద్రరెడ్డి, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట

పెనుకొండ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమయ్యే ప్యాక్‌హౌస్, కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 50శాతం సబ్సిడీతో అందజేస్తున్నారని ప్రతి ఒక్కరైతు సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి రాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు నాణ్యమైన విత్తనాలు, మొక్కలు, పంట పెంపకం, వాటి నిలువ, అమ్ముకోవడానికి, ఉత్పత్తులు తయారు చేయడానికి, మార్కెటింగ్ చేసుకోవడానికి రైతులకు గిడ్డంగులు ఎంతో అవసరమన్నారు. ప్రతి రైతు ప్రభుత్వం అందించే 50శాతం సబ్సిడీ గిడ్డంగులు నిర్మించుకోవాలని సూచించారు. 30/20 ప్యాక్ హౌస్ నిర్మాణానికి రూ.4లక్షలు కాగా రాయితీతో రూ.2లక్షలు, చిన్న తరహా పండ్ల మొక్కల నర్సరీ కోసం రూ.15లక్షలు కాగా రాయితీ విలువ రూ.7.50లక్షలు అన్నారు.

27నుంచి డేటా ఎంట్రీ కోర్సులకు శిక్షణ

పెనుకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27నుంచి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పది, ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన వారు అర్హులన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత వారికి సర్టిఫికెట్లతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

ఆగిన గోదాముల నిర్మాణం

వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో నష్టం


సి కొడిగేపల్లిలో నిర్మాణం ఆగిపోయిన గోదాము

మడకశిర రూరల్, డిసెంబరు 21:(ఆంధ్రజ్యోతి): ఎంత మంచి ఉద్దేశంతో పనులు మొదలుపెట్టినా వాటిని పూర్తి చేయకపోతే ప్రయోజనమేముంటుంది. అర్థంతరంగా ఆ పనులు ఆగిపోతే వాటివల్ల ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువ జరుగుతుంది. అందుకు ఉదాహరణగా మండలంలో నిర్మించతలపెట్టిన హార్టికల్చర్ గోడౌన్‌లను గురించి చెప్పుకోవచ్చు. రైతులు పండించే పంటలు నిలువ ఉంచేందుకు గోదాముల నిర్మాణం చేపడుతున్నామని చెప్పి మడకశిర మార్కెట్ యార్డు పరిధిలో జమ్మానిపల్లి, మెళవాయి, మడకశిర, కదిరేపల్లి, సి. కొడిగేపల్లి, బుళ్ళసముద్రం, ఆమిదాలగొంది, గుడిబండ, మండలపల్లి, మొరుబాగులు,హళ్ళికేర, రొళ్ళ, అమరాపురంలలో 13 గోదాముల నిర్మాణాలకు స్థలసేకరణ చేపట్టారు. ఒక్కొక్కగోదామును రూ.22 లక్షలతో నిర్మాణం కూడా చేపట్టారు. పాలకులు, అధికార్ల నిర్లక్ష్యం, నిధుల కొరత కారణంగా గోదాముల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. దీంతో తమ పంటలను నిలువ చేసుకోవడానికి కష్టాలు తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఈ నిర్మాణాలను పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తే అది అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి తిమ్మప్పను విచారించగా నిర్మాణంలో ఉన్న గోదాములు హార్టికల్చర్ శాఖ పరిధిలో ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై హార్టికల్చర్ అధికారిని విచారించగా ఆయన స్పందించలేదు.

వైసీపీ పాలనలో రైతులకు అన్నీ కష్టాలే

వైసీపీ పాలనలోరైతులకు మంచి జరిగింది ఏమీలేదు. రైతులు పండించిన పంటలను స్థానికంగానే కొనుగోలు చేసేందుకు రైతుల పేర్లు చెప్పి నాయకులు గోదాముల నిర్మాణం చేపట్టినా వాటిని పూర్తిచేయలేక పోయారు. ఇప్పటి కూటమి ప్రభుత్వమైనా వీటినిపూర్తిచేయాలి.


వెంకటరెడ్డి,రైతు
సీ కొడిగేపల్లి

దుమ్ము, ధూళితో తప్పని ఇబ్బందులు


దుమ్మూ ధూళితో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెరువుకట్ట ఆంజనేయస్వామి దేవాలయం వెనుక రైల్వే అధికారులు నూతనంగా వేసిన రోడ్డులో దుమ్ము ధూళి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రైల్వే అధికారులు డబుల్‌లైన్ నిర్మాణం చేపడుతున్నారు. అందులో భాగంగా పాతగేటును తొలగించి ఆ స్థానంలో నూతన రైల్వేగేటును ఏర్పాటుచేశారు. డబుల్ లైను నిర్మాణంలో భాగంగా నూతనంగా కంకర రోడ్డు వేశారు. కంకర రోడ్డులో రైల్వే అధికారులు నీరు చల్లకపోవడంతో దుమ్ముధూళి వ్యాపించి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి నూతనంగా వేసిన రోడ్డుపై నీరు చల్లాలని స్థానికులు కోరుతున్నారు.

పునాదులు బలంగా ఉంటే అద్భుతాలు

● ప్రొఫెసర్ ఆచార్య అజిత్‌కుమార్

హిందూపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజోతి): విద్యాబోధనలో ఉపాధ్యాయులు పునాదుల లాంటి వారని పునాదులు బలంగా ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుతాలు సృష్టించవచ్చని వికసిత్ భారత్ ప్రచారకుడు ప్రొఫెసర్ ఆచార్య అజిత్‌కుమార్, ఎస్‌ఈఆర్‌టి ప్రొఫెసర్ రాష్ట్ర పరిశీలకుడు గంగిరెడ్డి పేర్కొన్నారు.


ప్రొఫెసర్ ఆచార్యను సన్మానిస్తున్న దృశ్యం

శనివారం బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఐదవ విడత ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణతరగతులకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా విధానం పటిష్టంగా ఉండాలంటే అందుకు పునాదులు ఉపాధ్యాయులన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు దగ్గరగా ఉంటూ వారిని ప్రేమగా పలకరించి ఆకట్టుకునేలా విద్యను అందించాలన్నారు. అపుడే వారిలో దేశభక్తి, సమైక్యత, కష్టపడే తత్వం, పెద్దలను గౌరవించడం నేర్చుకుంటారన్నారు. 2047 కల్లా ప్రపంచంలోనే భారత్ నెంబర్‌వన్‌గా ఎదుగుతుందని తెలిపారు. ఇప్పటికే సాంకేతికంగా భారత్ ఎంతో ముందుందన్నారు. ఉపాధ్యాయులు దేశభవిష్యతుకు పునాదులు వేసే విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. అనంతరం టిఎల్‌ఎం తయారీ డాక్యుమెంటేషన్ పార్టిసిపేషన్‌లో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఎంఈఓ గంగప్ప ఆచార్య అజిత్‌కుమార్, పరిశీలకుడు గంగిరెడ్డిలను సన్మానించాడు. కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌ఛార్జు బాబా ఫక్రుద్దీన్, హాస్టల్ ఇన్‌చార్జి నసీఫాసుల్తానా, డిఆర్పీలు కే ఆర్పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెగిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టండి


ఇరిగేపల్లి వద్ద తెగిన కల్వర్టు

అగళి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : అగళి మండలం ఇరిగేపల్లి గ్రామం వద్ద తెగిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మూడు సంవత్సరాలు క్రితం కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు పూర్తిగా తెగిపోయిందని నేటికీ మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు. అగళి నుంచి శిర వరకు బస్సుల రాకపోకలు ఈ కల్వర్టు మీదుగానే జరిగేవని , అయితే కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలు హైవేపై జరగడంవల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా అనుమపల్లి గ్రామం దగ్గర కల్వర్టు తెగిపోయింది. దానికి కూడా మరమ్మతులు చేపట్టలేదు. ఈ రెండింటికి వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులను ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్పలకు భిక్ష.. పుణ్యకార్యం

హిందూపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దానాల న్నింటిలోకి అన్నదానం పుణ్య కార్యక్రమం అని, అందులోను మాల ధరించిన అయ్యప్ప భక్తులకు అన్నదానం చేయడం చాల మంచి కార్యక్రమం అని తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొటిపి అరుణాచలరెడ్డి పేర్కొన్నాడు. పట్టణ పరిధిలోని బెంగళూరురోడ్డులో అయ్యప్ప అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి రోజు వందలాది మంది మాల ధరించిన అయ్యప్ప భక్తులకు మధ్యాహ్నం భోజన సదుపాయం చేయడం పుణ్యకార్యక్రమం అన్నారు. శనివారం ఆయన అన్నదానానికి సహకరించి స్వహస్తాలతో మాలధరించిన భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా అరుణచలరెడ్డి దంపతులకు అయ్యప్ప అనుగ్రహం కలగాలని గురుస్వామి ఠాగూర్, అన్నదాన కమిటి అధ్యక్షుడు డి.ఇ. రమేష్‌లు, అయ్యప్ప భక్తులు శరణుఘోషతో కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా మైనార్టీ యువనాయకుడు జుబేర్‌ఆధ్వర్యంలో మాలధరించిన అయ్యప్ప భక్తులకు అన్నదానం చేపట్టారు. కులమతాలకు అతీతంగా ఆయన అన్నదానం చేయిండం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, అంజినరెడ్డి, శ్రీరాములు, సుబహాన్, ఆటో సంజీవ తదితరులు ఉన్నారు.


అన్నదానం చేస్తున్న అరుణాచలరెడ్డి

చికిత్స పొందుతూ సిక్కిం మహిళ మృతి


రంజితాగురాగ్ (ఫైల్)

గోరంట్ల, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లి వద్ద లారీ, కారును ఢీకొన్న సంఘటనలో గాయపడిన సిక్కిం మహిళ రంజితగురాగ్(35) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. సిక్కిం రాష్ట్రానికి చెందిన వస్కర్‌శర్మ భార్య, ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి పుట్టపర్తి సందర్శన కోసం వస్తుండగా శుక్రవారం రాత్రి ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గాయపడిన రంజితగురాగ్‌ను 108లో పెనుకొండ ఆసుపత్రి, తరువాత అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సవేరాలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి కుమార్తె ఉన్నారు. పుట్టపర్తి విహారయాత్ర వారి కుటుంబంలో విషాదం నింపింది. భర్త వస్కర్ శర్మ ఫిర్యాదు మేరకు గోరంట్లకు చెందిన లారీ డ్రైవర్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రియల్టర్ల మధ్య ఘర్షణ.. కేసు నమోదు

గోరంట్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాబు తెలిపారు. మండలంలోని గుమ్మయ్యగారిపల్లి వద్ద పదిసెంట్ల స్థలం విషయంలో వడల చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డికి రూ. 33 లక్షలు బాకీ పడ్డారు. ఏళ్లతరబడి సతాయిస్తుండడంతోపాటు తనను ఇంటికి రమ్మని ఘర్షణపడుతూ తనపై దాడికి పాల్పడినట్లు రామచంద్రారెడ్డి తెలిపారు. చంద్రశేఖర్‌రెడ్డి అతని కుమారుడు మరో వ్యక్తితో కలిసి తనపై దాడి చేసినట్లు చెప్పారు. దీంతో రామచంద్రారెడ్డి తరువాత తన అనుచరులతో చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బాబు పోలీస్ సిబ్బందితో వెళ్లి, పరిస్థితి చక్కదిద్దారు. రామచంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు, స్టార్టర్ చోరీ

గోరంట్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదిలి సమీపంలో రైతు బ్రహ్మచారి జామతోటలోని షెడ్‌లో ఉంచిన మోటార్, స్టార్టర్, వైర్, స్కేల్ శుక్రవారం రాత్రి చోరీకి గురయినట్లు బాధితుడు గోరంట్ల పోలీస్‌లకు శవారం ఫిర్యాదు చేశారు. షెడ్ తలుపులు పగులకొట్టి అందులో ఉంచిన మోటార్, స్టార్టర్, వందమీటర్ల కేబుల్‌వైర్, డిజిటల్ వెయింగ్ స్కేల్ చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటి విలువ దాదాపు రూ.70వేలు ఉంటుందన్నారు.

వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ

మడకశిర రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆమిదాలగొంది ఉన్న వేంకటేశ్వర వృద్ధాశ్రమాని నాగలమడక గ్రామానికి చెందిన దాతలు మారుతి దంపతులు వృద్ధులకు దుస్తులు పంపిణీచేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారికి తిమ్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బెంచీలు ఏర్పాటు చేయించిన మంత్రి సవిత


బెంచీలు వేయిస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద, వైఎస్‌ఆర్ సర్కిల్‌లో, కొత్తపల్లి క్రాస్ వద్ద, గోరంట్ల బస్టాండు రోడ్డులో, ఆంజనేయస్వామి ఆలయం వద్ద, ప్రజల సౌకర్యార్థం బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత శనివారం సిమెంటు బెంచీలను ఏర్పాటు చేయించారు. తన తండ్రి దివంగత మాజీ మంత్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం సొంత నిధులతో వాటిని ఏర్పాటు చేయించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ సిద్దలింగప్ప, టౌన్‌కన్వీనర్ సూరీ, జనసేన కార్యకర్త నాగరాజు, ఐటీడీపీ నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సోమందేపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌కు శనివారం తృటిలో ప్రమాదం తప్పింది. ప్రహరీకి ఆనుకుని ఉన్న చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ వైరుపై పడింది. నిప్పురవ్వలు చెలరేగడంతో అక్కడే ఉన్న సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వారు స్పందించి సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు. సంఘటన ఉదయం 11.30కు చోటుచేసుకోగా ఆ సమయంలో ఫిర్యాదులు అందజేయడానికి చాలామంది స్టేషన్‌కు వచ్చి ఉన్నారు. అకస్మాత్తుగా ఈ సంఘటన చోటుచేసుకోవడంతో పలువురు భయాందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పింది.

వైభవంగా అయ్యప్ప మండలపూజ

హిందూపురం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): హరిహరపుత్రుడు, కారణజన్ముడు అయిన శ్రీ అయ్యప్ప మండలపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. పట్టణ పరిధిలోని శ్రీకంఠపురం శ్రీకంఠేశ్వర అయ్యప్ప ఆలయంలో శనివారం మండలపూజా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం బెంగళూరు నుంచి తెప్పించిన పూలతో ప్రత్యేకంగా సర్వాంగ సుందరంగా ముస్తాబే చేశారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో, మేళతాళాలు, మంగళవాయిద్యాలతో హోమాలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు భజనలు కీర్తనలతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో నగరోత్సవం నిర్వహించారు.

పుట్టపర్తికి కర్ణాటక భక్తుల పాదయాత్ర


పెనుకొండలో ఊరేగింపు నిర్వహిస్తున్న సాయి భక్తులు

పెనుకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం పాలా గ్రామం నుంచి 25మంది సత్యసాయిబాబా భక్తులు పుట్టపర్తికి 500కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారు. ఈనెల 5నుండి పాదయాత్ర చేపట్టిన భక్త బృందం శనివారం పెనుకొండకు చేరుకుంది. పెనుకొండకు చేరుకున్న పాదయాత్ర బృందానికి స్థానిక సత్యసాయి సేవా సమితి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.వారికి సత్యసాయి భజన మందిరంలో బస, భోజన వసతులు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాద మృతులను ఆదుకోవాలి : రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బుళ్ళసముద్రం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన వారిని, క్షతగాత్రులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి కోరారు. మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తంచేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి


కప్పుతో ఆనందాన్ని పంచుకుంటూ..

మడకశిర రూరల్, డిసెంబరు 21:(ఆంధ్రజ్యోతి) మండలంలోని గుండమల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని భూమిక రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు.అనంతపురంలో ప్రాంతీయ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్‌మీట్‌లో లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్, ఈవెంట్స్‌లో మొదటి స్థానంలో నిలబడి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ సాధించి భూమిక రాష్ట్ర స్థాయికి ఎంపకైట్లు అదే విధంగా ద్వితీయ సంవత్సరం చదువుతున్న చందన 800 మీ రన్నింగ్ లో తృతీయ స్థానం నిలిచిందని తెలిపారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం


ఒకవైపు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

అమరాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కెంకెర, హేమావతి మార్గ మధ్యంలో రహదారి పక్కన విద్యుత్ స్తంభం ఒకవైపు వరిగిపోయింది. దీంతో ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనని రైతులు అటు వైపు వెళ్లే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా పట్టించుకొనే నాథులే కరవయ్యారని విద్యుత్ అధికారులు ఆ రహదారి మీదుగా ప్రతి నిత్యం వెళ్లినా కన్నెత్తి కూడా చూడరని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే కానీ అధికారులు స్పందించేలా లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినిత్యం వందలకొలది వాహనాలు తిరుగుతున్నాయని, విద్యుత్ స్తంభం పూర్తిగా తుప్పుపట్టిపోయిందని విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదం జరగకముందే స్తంభాన్ని మార్చాలని ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి


విద్యుత్ షాక్‌తో మృతిచెందిన ఎద్దు

లేపాక్షి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతిచెందిన సంఘటన శనివారం బసవన్నపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రైతు ఆదిమూర్తి రెడ్డి పొలంలో ఎద్దులతో దుక్కి చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ స్థంబానికి సపోర్ట్‌గా ఉన్న స్టేవైరుకు తగిలి ఒక్కసారి షాక్‌కు గురై కుప్పకూలిందన్నారు. వెంటనే మరో ఎద్దు, రైతు అక్కడి నుంచి చాకచక్యంగా తప్పించుకున్నామన్నారు. విద్యుత్ స్థంభానికి సపోర్ట్‌గా ఉన్న స్టేవైరుకు మోటార్ సర్వీస్ వైరు చుట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని గ్రామస్థులు తెలిపారు. వ్యవసాయ మోటార్లకు అందించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా తక్కువ ఎత్తులోనే అమర్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌ల ఎత్తు పెంచి ప్రమాదాలను అరికట్టాలని, రైతుకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. ఇటీవల కాలంలోనే రైతు రూ.1.40లక్షలు వెచ్చించి ఎద్దును కొనుగోలు చేశామన్నారు. ఒక ఎద్దు మృతిచెందడంతో పూర్తీగా నష్టపోయానన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

పావగడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పావగడ దళిత సంఘం నాయకులు తాలూకా కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఇటీవల పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రపంచ దేశాలు అంబేడ్కర్‌ను ఒక మేధావిగా జ్ఞాన సంపన్నుడిగా కొలుస్తున్నప్పటికీ ఈ దేశ అగ్రవర్ణాలు అంబేడ్కర్‌ను అంటరానివాడిగా చూడటం దారుణమైన విషయం అని దళిత నాయకులు తీవ్రఆగ్రహం వ్యక్తంచేశారు.

ఈనేపథ్యంలో అమిత్‌షా చిత్రపటానికి చెప్పుల హారం వేసి నిరసన వ్యక్తం చేశారు. అనేక మంది స్వచ్ఛంద సేవా సంస్థల నాయకులు ఈర్యాలీలో పాల్గొని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.